ప్రజాశక్తి
గురువారం 13 ఫిబ్రవరి 2025
5
శ్రీకాకుళం



బిఆర్ఎయు ప్రగతికి సహకరించాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కోరిన విసి రజని

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తిని వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని కోరారు. మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోధన, పరిశోధన, పరిపాలనా కార్యక్రమాలకు సహయ, సహకారాలు అందించాలని కోరారు. వర్సిటీలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు, సంస్కరణల గురించి వివరించారు. 'పిఎం-ఉషా' పథకం నిధుల ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలు, ప్రణాళికలను తెలియజేశారు.

రైతులకు భూ ఆధార్

- ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య
- ఆర్ఎస్‌కెల ద్వారా మొదలైన జారీ
- ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశం

రబీ వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు అదనంగా మరో పని వచ్చి పడింది. రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కె) చుట్టూ తిరగాల్సిన అవసరం ఏర్పడింది. 'ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించింది. విశిష్ట సంఖ్యకు అర్హులైన రైతులను గుర్తించి, ప్రభుత్వ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేందుకు భూ ఆధార్ అవసరమని పేర్కొంది. ప్రభుత్వ సూచనలతో జిల్లాలో నమోదు ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకునేలా చూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 6.20 లక్షల ఎకరాల్లో పలురకాల వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలో లక్ష ఎకరాల్లో కొబ్బరి, జీడి, మామిడి తదితర పంటలు సాగవుతున్నాయి. 249 ఎకరాల్లో పట్టు సాగుతోంది. వీరందరికీ తొలుత 14 అంకెలతో ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు. తర్వాత భూ ఆధార్ పేరుతో కార్డులను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు పేరు నమోదుకు అర్హుడే అని ప్రభుత్వం తెలిపింది. విశిష్ట సంఖ్య పొందేందుకు రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తారు. రైతు ఫోన్ నంబరుకు వచ్చిన ఒటిపి సిబ్బందికి చెప్తే వారు 14 అంకెల సంఖ్యను చెప్తారు.

భూ ఆధార్‌పై అవగాహన



గార మండలం కొర్లాంలో ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విశిష్ట సంఖ్య సాయంతో అర్హులైన రైతుల గుర్తింపు, వారికి వర్తించనున్న సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తోందని చెప్తున్నారు. పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పథకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ వంటి పథకాలను నేరుగా పొందే అవకాశం ఉందని వివరిస్తున్నారు. వీటితోపాటు నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి దోహదపడుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

విశిష్ట సంఖ్య జారీలో అసలు ఉద్దేశం ఇదేనా?

రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అనర్హులు పొందుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, గతంలో వైసిపి ప్రభుత్వం అందించిన రైతు భరోసా అనర్హులు కూడా పొందినట్లు గుర్తించింది. భూ ఆధార్‌తో వాటిని ఏరివేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఫించన్లు, ఇళ్లపై సర్వే చేసి అనర్హులను తొలగిస్తున్న ప్రభుత్వం... భూ ఆధార్‌తో అర్హులెవరు, అనర్హులు ఎవరనేది కూడా పనిలో పనిగా తేలుతుందని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

రైతులకు తప్పని అవస్థలు

భూ ఆధార్ జారీలో రైతులకు అవస్థలు తప్పేలా లేవు. ప్రస్తుతం రబీ వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడంతో ఆర్ఎస్‌కెలకు రావడం, క్యూలో నిల్చొని నమోదు చేయించుకునేందుకు కొంత సమయం కేటాయించాల్సి ఉంటుంది. దీంతోపాటు చాలామంది రైతులు తమ భూములను కౌలుకు ఇచ్చి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు.

ఈ-క్రాప్ బుకింగ్ సమయంలోనూ వారు రాలేకపోయారు. పండిన పంటను వ్యాపారులు, దళారులకు అమ్ముకున్నారు. పెట్టుబడి సాయం, ఇతర సంక్షేమ పథకాల వర్తింపునకు భూ ఆధార్ తప్పనిసరి చేసే అవకాశం ఉండడంతో, వారు సొంతూళ్లకు పయనమవుతున్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి స్పష్టం చేశారు. మండలంలోని చాపర, కరజాడ, గొప్పిలి, పెద్దమడి, మెళియాపుట్టిలోని కెజిబివి పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న జరుగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. 2007లో శాసనమండలి పునరుద్ధరించిన తర్వాత గెలుపొందిన ఎమ్మెల్సీలు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా ఏర్పడి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు, పింఛనుదారులు, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో, వెలుపలా పోరాటాలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. కెజిబివి, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు, అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకుల మినిమం టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ పరిష్కారంలో సంఘాలకు అండగా నిలిచారని చెప్పారు.

నూతన విద్యా విధానంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారని, పిల్లలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై పని భారం, ఒత్తిడి పెరుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఇతర అనేక సమస్యలపై పోరాడిన అనుభవం తనకు ఉందని, మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, ఎల్.వి చలం, జి.కుమారస్వామి, ఎ.లక్ష్మీనారాయణ, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హసీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయస్థాయిసీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర జట్టుకు జిల్లాకు చెందిన షేక్ హసీనా ఎంపికైంది. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు హర్యాణాలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల మండలం తోటపాలెంకు చెందిన ఆమె తండ్రి భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నారు. హసీనాను ఎమ్మెల్యే, జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్ గొండు శంకర్, అధ్యక్షులు ఎన్.రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, నిర్వాహక కార్యదర్శి సాధు శ్రీనివాసరావు అభినందించారు.



మాట్లాడుతున్న గణపతిరావు

ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి- మందస

రైస్ మిల్లు కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మండల కన్వీనర్ కె.కేశవరావులు డిమాండ్ చేశారు. మందస సిద్ధూరు పరిధిలోని కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ డిమాండ్ నోటీసు ఇచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా... వేతన సవరణ చేసేందుకు యాజమాన్యాలు సహకరించలేదన్నారు. దీంతో సమ్మె అనివార్యమైందన్నారు. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ... కార్మికుల హక్కులు ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. జిల్లా లేబర్ అధికారులు చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు తదితరులు సంఘీభావం తెలిపారు. సమ్మెలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాలకృష్ణ, కె.కృష్ణారావు, పి.కూర్మారావు, బి.దుర్యోధన, ఆర్.ఏకాశి, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి - గార

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో పాటు ఇతర ఖైదీలతో ఆయన మాట్లాడారు. వారి ఆరోగ్యంపై అధికారులతో మాట్లాడారు. దీర్ఘకాలంగా రిమాండ్ ఖైదీలుగా ఉంటూ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోలేని వారికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. బెయిల్ పిటీషన్ల కోసం వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. జైల్లోని ముద్దాయిలకు హెచ్ఐవి, హెచ్‌సివి మెడికల్ టెస్టులను ఏర్పాటు చేసి వైద్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఆహారాన్ని పరిశీలించి, పరిసర ప్రాంతాలను సందర్శించి సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపిఎం ఆదిలింగం, జైలర్ దివాకర్ నాయుడు, ప్రిజన్ ప్రోగ్రామర్ పి.దేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

సమగ్ర దర్యాప్తుతో కేసుల ఛేదన

- కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు
- ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సమగ్రమైన దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో చైన్ స్నాచింగ్, వాహనాల చోరీ, ఆలయాల్లో దొంగతనాలు, చోరీలు, నేరాలు, సిసి కెమెరాల ఏర్పాటు, ప్రాపర్టీ నేరాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రాపర్టీ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల నమోదు దర్యాప్తు పెండింగ్, కేసుల దర్యాప్తులో ప్రగతి, ముద్దాయిల అరెస్టు తదితర అంశాలపై ఆరా తీశారు. అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసుల్లో లాస్ట్ ఆఫ్ ప్రాపర్టీ, రికవరీ ఆఫ్ ప్రాపర్టీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో భాగంగా ఇటీవల జైలు నుంచి విడుదలైన నేరస్తుల కదలికలు, సిసి కెమెరాలు, ఇతర భౌతిక ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేరస్తులను గుర్తించి వేగవంతంగా కేసులు ఛేదించాలన్నారు. నేర ప్రవృత్తి విధానం బట్టి నేరస్తులను పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని, ఆ దిశగా దర్యాప్తు చేపట్టి ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రత్యేక బృందాలతో పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ప్రజలకు సిసి కెమెరాల ప్రాముఖ్యతను వివరించి వ్యాపార, గృహ సముదాయాలు, ఆలయాల వద్ద స్వతహాగా ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని సూచించారు. హ్యూమన్ ఇంటెలిజెన్స్‌తో పాటు నేరాల ఛేదనలో సిసి కెమెరాలు కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. నేరాలు ఛేదన, నియంత్రించడంలో సిసి కెమెరాల పాత్ర కీలకమన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో, కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. దొంగతనాలు ఇతర ప్రాపర్టీ నేరాలను నియంత్రించడానికి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. నేరాల కట్టడి చేయడానికి నిర్మానుష్య ప్రాంతాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. మహిళలు, మైనర్ బాలికలపై జరిగే నేరాలు, కేసుల నమోదు దర్యాప్తు తదితర అంశాలపై ఆరా తీసి, నిర్ణీత గడువులోగా ఛార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. రానున్న లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశమున్న కేసులను గుర్తించి ఎక్కువ మొత్తంలో కేసులు డిస్పోజ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ విధానంతో మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ రహిత డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, న్యూసెన్స్ కేసులు నమోదు చేయాలని, అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు కోటేశ్వరరావు, గోవిందరావు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత బన్నీ వాసు

నేడు 'తండేల్' సక్సెస్ మీట్

చిత్ర నిర్మాత బన్నీ వాసు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తండేల్ చిత్రం సక్సెస్ మీట్‌ను నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 13వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ చిత్ర నిర్మాత బన్నీ వాసు తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర కథా రచయిత కార్తీక్‌తో కలిసి మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా కె.మత్స్యలేశం మత్స్యకారుల యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రాన్ని అన్ని వర్గాల ప్రజలూ ఆదరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోనే విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామన్నారు.

హీరో హీరోయినట్లు నాగ చైతన్య, సాయిపల్లవి, నిర్మాత అల్లు అరవింద్, సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. పాకిస్థాన్‌కు చిక్కి విడుదలైన 22 మంది మత్స్యకారులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించామన్నారు. చిత్రాన్ని భారీస్థాయిలో విజయాన్ని అందించిన ప్రేక్షకులు, జిల్లా ప్రజలు విజయోత్సవ సభనూ విజయవంతం చేయాలని కోరారు.

పంటల బీమాకు ఇకెవైసి తప్పనిసరి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - పొందూరు

పంటల బీమా వర్తించాలంటే సీజనల్ వారీగా ఈ-పంట నమోదుతో పాటు రైతుల ఇకెవైసి తప్పనిసరి అని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. మండలంలోని తోలాపి, కనిమెట్టలోని రబీ ఈ-పంట నమోదు వివరాలను బుధవారం తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో ఉన్న వరిపంట కుప్పలను చూసి నూర్పులు చేపట్టకపోవడంపై రైతులను ప్రశ్నించారు. అపరాలు తీసిన తర్వాత నూర్పులు చేపట్టనున్నట్లు రైతులు తెలిపారు. త్వరితగతిన వరిపంట నూర్పులు చేపట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని రైతులకు జెసి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి, ఎడి వి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి బి.బాబ్జీ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తోలాపి వద్ద రబీ పంటను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

హోం కంపోస్టు తయారీపై అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, అందులో భాగంగా నిత్యం ఇంట్లో ఉత్పత్తవుతున్న తడి, పొడి చెత్తలను వేరు చేసి హోమ్‌కంపోస్టు తయారు చేయడం అలవర్చుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.డి.వి.వి ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు హోం కంపోస్టు తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. స్కూల్‌లో వ్యర్థాలు సేకరించి తడి చెత్తతో కంపోస్టు ఎరువులను తయారు చేయాలన్నారు. అందుకు అవసరమైన సహకారాన్ని నగరపాలక సంస్థ అందిస్తుందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఇంట్లో వెలువడే చెత్తను తడి చెత్త పొడి చెత్త వేరు చేసి రోజూ మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడకాన్ని విడనాడి గుడ్డ సంచులు వాడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్ కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

14న 'ఘంటశాల ది గ్రేట్' విడుదల

- ఒక టిక్కెట్‌పై ఇద్దరు చూడొచ్చు
- చిత్ర దర్శకుడు రామారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 14వ తేదీన విడుదల కానున్న 'ఘంటశాల ది గ్రేట్' చిత్రాన్ని ఆదరించాలని ఆ చిత్ర నిర్మాత, దర్శకుడు సిహెచ్.రామారావు కోరారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14న నగరంలోని మారుతీ థియేటర్‌లో విడుదల చేసే ఈ సినిమాను ఆరోజు ఒక టిక్కెట్‌పై ఇద్దరు చూసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. నగరంలోని ఒక రెస్టారెంట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు పాట ఉన్నంత కాలం ఘంటశాల వెంకటేశ్వరరావు సజీవంగా ఉంటారని... ఆయన కీర్తి, ఖ్యాతి అజరామరమని అన్నారు. ఘంటశాల గురించి నేటి తరానికి తెయజెప్పాలన్న ఆలోచనతోనే ఈ సినిమాను తెరకెక్కించామని తెలిపారు. ఘంటశాల గాయకుని గానే కాకుండా వ్యక్తిత్వం కూడా ఎంతో ఉన్నతమైందని కొనియాడారు. తెలుగు మాటను, పాటను తనదైన స్వరంతో అలరించిన మహానుభావుడు అని అన్నారు. రాష్ట్రంలో ఏ గాయకునిపైనా పూర్తిస్థాయి నిడివి చిత్రం ఇంతవరకు నిర్మించలేదని, ఆ అవకాశం తనకే దక్కిందన్నారు. ఈ చిత్రంలో గాయకుడు కృష్ణచైతన్య, యాంకర్ మృదుల నటన ఎంతగానో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. వారితో పాటు సుమన్, భార్గవి, సాయికిరణ్ వంటి సీనియర్ నటీనటులు పలు పాత్రలను పోషించారన్నారు. తొలుత శ్రీకాకుళంలో సినిమాను విడుదల చేసిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జైత్రయాత్ర సాగుతుందన్నారు. ఘంటశాల అభిమానులు, ప్రజలు సినిమాను ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో వ్యాపారవేత్త నటుకుల మోహన్, చక్రవర్తి, గాయకులు బగాది కూర్మారావు, ఈవెంట్ మేనేజర్ సాయిబాబు, మార్గదర్శి శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారావు



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

హోంగార్డుగా కారుణ్య నియామకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఇటీవల మృతి చెందిన హోంగార్డు శ్రీనివాసరావు భార్య కె.ఉదయకుమారికి కారుణ్య నియామకం మేరకు హోంగార్డుగా నియమించారు. ఈ నియామక పత్రాన్ని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఎస్‌పి కార్యాలయంలో బుధవారం అందజేశారు. మృతి చెందిన హోంగార్డుల కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సుదీర్ఘ కాలంగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ... మృతి చెందడం బాధాకర మన్నారు. ఏటువంటి సమస్య ఉన్నా నేరుగా తనను కలవవచ్చునని, పోలీసుశాఖ మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అలాగే హోంగార్డు గోవిందరావు మృతి చెందారు. హోంగార్డుల ఒక్క రోజు వేతనం రూ.4.06 లక్షలు విరాళం అందజేశారు. ఆ విరాళాల చెక్కును ఎస్‌పి మృతుని భార్య నాగరత్నమ్మకు అందజేశారు. కార్యక్రమంలో అర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, డిపిఒ ఎఒ సిహెచ్.గోపీనాథ్, ఆర్ఐ వెంకటరమణ, క్లర్క్ రామకృష్ణ పాల్గొన్నారు.



వివరాలను సేకరిస్తున్న డిఎంహెచ్‌ఒ బాలమురళీకృష్ణ

డిఎంహెచ్‌ఒ పరామర్శ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని కాపుగోదాయవలసకు చెందిన యువత్ అనే బాలుడు జిబిఎస్ వ్యాధితో బ్రెయిన్ డెడ్ మృతి చెందడం, ఆయన అవయవాలు తల్లిదండ్రులు దానం చేసిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న డిఎంహెచ్‌ఒ బాలమురళీకృష్ణ బుధవారం యువత్ తల్లిదండ్రులను పరామర్శించారు. మొదట వ్యాధి లక్షణాలు ఏ విధంగా బయట పడింది... ఎక్కడ వైద్య పరీక్షలు నిర్వహించారని ఆయన బాలుడు తల్లిదండ్రులు చిరంజీవి, రోజాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొంతు నొప్పి, జ్వరం ఉన్న ఆరుగురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ ఆస్పత్రుల్లో ఇచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించారు. అందులో ఒకరికి జిబిఎస్ వ్యాధిగా గుర్తించారు. గ్రామంలో నీటి సామర్థ్య పరీక్షలు నిర్వహించి, వైద్య శిబిరం, ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు సర్పంచ్ అంగ లక్ష్మి, జనార్దన్, మల్లేష్ మాట్లాడుతూ గ్రామానికి 104 సేవలు అందించాలని కోరారు. 108 వాహనం కాల్ చేసినా రావడంలేదని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ మేరీ కేథరిన్ డిపిఎంఒ వాన సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరిని గెలిపించుకుందాం



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న గిరిధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ అధ్యాపక సమస్యలు పరిష్కారానికి తమ గొంతుకై పోరాడే సత్తా ఉన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో బుధవారం అధ్యాపక, ఉపాధ్యాయ మిత్ర సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ అధ్యాపకులు కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న పోరాటాన్ని గుర్తుచేశారు. చట్టసభలో పిడిఎఫ్ అభ్యర్థుల సంఖ్యను పెంచుకోవడం ద్వారా ఉపాధ్యాయ, ఉద్యోగుల గొంతుక మాట్లాడగలదన్నారు. అందువల్ల పిడిఎఫ్ అభ్యర్థికి తమ సంఘం పూర్తి మద్దతు నిస్తున్నట్లు తెలిపారు. అలాగే జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక కార్యదర్శి, పూర్వ ఉప విద్యాశాఖ అధికారి కొత్తకోట అప్పారావు, సిఐటియు సీనియర్ నాయకులు బి.కృష్ణమూర్తి, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.బాబూరావు, సూర్య స్వర్ణకుమారి, శ్రామిక మహిళా జిల్లా నాయకులు కె.నాగమణి, ప్రయివేటు కళాశాల అధ్యాపకుల సంఘం నాయకులు యు.దుర్గాప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు పోలాకి చిన్నారావు, తర్ర వైకుంఠరావు, రెడ్డి త్రినాథరావు, వై.ఎస్.అర్జున్, లుకలాపు శ్రీనివాస్, జి.అజయ్‌కుమార్, జె.విశ్వనాథం, సిఐటియు సీనియర్ నాయకులు అల్లు సత్యం, నగర కార్యదర్శి రట్టి ప్రకాశరావుపాల్గొన్నారు. అనంతరం విజయ గౌరిని ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



నందిగాం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నందిగాం : యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, వి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నందిగాం, కాపుతెంబూరు, కణితి ఊరు, నౌగాం, దిమ్మిడిజోల, నర్సిపురం, లఖిదాసుపురం, పెద్దబాణాపురం, కవిటి అగ్రహారం పాఠశాలల్లో బుధవారం ప్రచారం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కేదాలయ్య, జనత జన చైతన్య వేదిక రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, పి.ధర్మారావు, జిల్లా కార్యదర్శి బి.శంకరరావు, కుమారస్వామి, యుటిఎఫ్ నాయకులు వై.గణపతిరావు, వి.సింహాచలం, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల నోటీసు అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న జిల్లా కేంద్రంలోని ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ అనురాధకు బుధవారం ధర్నా నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి పి.భూలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలన్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు మార్చాలని కోరారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న సెంటర్ల అద్దెలు, టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్చాలన్నారు. ప్రీ స్కూల్ బలోపేతం చేసి ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండేటట్లు జిఒ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.కృష్ణవేణి కె.సునీత జి.భారతి, ఎస్.ప్రమీల, ఎం.విజయమ్మ పాల్గొన్నారు.



ధర్నా నోటీసు అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రీ ఫైనల్ పరీక్షలకు విరామం

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యాశాఖ విరామం ప్రకటించింది. ఈ నెల 10న ప్రారంభమైన పరీక్షలు లాంగ్వేజ్ పరీక్షలు బుధవారం పూర్తయ్యాయి. ఈ క్రమంలో వరుసగా మూడు రోజుల పాటు విరామాన్ని ప్రకటించి మళ్లీ సోమవారం నుంచి మిగిలిన సబ్జెక్టుల పరీక్షలకు సంబంధించి ఉన్నతస్థాయి విద్యాశాఖాధికారులు సూచించారు. విద్యార్థుల్లో పరీక్షలంటే ఒత్తిడికి గురికాకూడదని భావించిన అధికారుల సూచనల మేరకు ఈ విరామాన్ని ప్రకటించారు. అయితే వార్షిక పరీక్షల్లో మాత్రం విరామం లేకుండా రోజూ పరీక్షలు నిర్వహించనున్నారు.

పలాస ప్రెస్‌క్లబ్ కన్వీనర్‌గా నాని

ప్రజాశక్తి- పలాస



నాని

పలాస-కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) కన్వీనర్‌గా దేవ విశ్వేశ్వరరావు (నాని)ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రెస్‌క్లబ్ సభ్యులు సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని రద్దు చేస్తూ... నూతనంగా సభ్యులందరూ ఏకగ్రీవంగా, నానిని కన్వీనర్‌గా ఎన్నుకున్నామన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో డి.మహారణ, జగదీష్, రమణ, హరినారాయణ, అంది రామకృష్ణ (రాము) భాస్కరరావు, వంకల రాజారావు, శివజ్యోతి, తిరుమలరావు, శ్రీను, సవర చిన్నబాబులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

చార్లెస్ డార్విన్ జయంతి

లావేరు : చార్లెస్ డార్విన్ ప్రఖ్యాత ప్రకృతి శాస్త్రవేత్త అని బుడుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జన విజ్ఞన వేదిక పర్యావరణ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పూజారి గోవిందరావు అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం చార్లెస్ డార్విన్ జయంతి కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిణామ సిద్ధాంతానికి ఆయన కృషి చేశారని అన్నారు. డార్విన్ ప్రతిపాదించిన సహజ ఎంపిక సిద్ధాంతం జీవ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. చిన్నప్పటి నుంచి ప్రకృతిపై ప్రత్యేక ఆసక్తి కనబరిచేవాడని తెలిపారు. 1831లో డార్విన్ హెచ్‌ఎంఎస్ బీగల్ అనే నౌకలో ప్రపంచ యాత్రకు వెళ్లారని అన్నారు. ఈ యాత్రలో గాలాపాగోస్ దీవులలోని జీవులపై ఆయన చేసిన పరిశీలన ఆయన పరిణామ సిద్ధాంతానికి పునాది వేసిందన్నారు. డార్విన్ తన పరిశీలనల ఆధారంగా జీవులు కాలక్రమేణా మారుతాయని అన్నారు. మనుగడ కోసం జరిగే పోరాటంలో ప్రకృతిని తట్టుకోగల జీవులు మాత్రమే బతుకుతాయని, మిగిలినవి నశిస్తాయని డార్విన్ చెప్పారని అన్నారు.



దగ్ధమవుతున్న టీ షాపు

టీ షాపు దగ్ధం

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రమైన కొత్తూరులోని నివగాం రహదారిలో ఉన్న గోగుల రామారావు నాయుడు కాంప్లెక్స్ ఆవరణలో మన్యం పార్వతీపురం జిల్లా భామిని మండలం పెద్దదిమిలికి చెందిన సల్ల సన్యాసిరావు టీ టైం నిర్వహిస్తున్నాడు. బుధవారం టీ చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో ప్రమాదానికి గురైంది. అప్రమత్తమైన సిబ్బంది బయటకు పరుగుతీశారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక అధికారి ఎస్.బుచ్చోడు శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో షాపులోని కూలర్, ఫ్రిజ్, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని బాధితుడు తెలిపారు. దళిత కుటుంబానికి చెందిన వాడినని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



బైండోవర్ కేసు నమోదు చేస్తున్న తహశీల్దార్

19 మందిపై బైండోవర్ కేసులు

మెళియాపుట్టి : మండల పరిధిలోని సవరపోలూరు, అప్పోజిపేట, దాసుపురం, గొల్లబంజీరు గ్రామాలకు చెందిన 19 మంది బైండోవర్ కేసు నమోదు చేశామని టెక్కలి ఎక్సైజ్ సిఐ ఎస్కే మీరా సాహెబ్ తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ ఎదుట బైండోవర్ నిమిత్తం బుధవారం హాజరుపరిచామన్నారు. ఎవరైనా ఇదే నేరంతో పట్టుబడితే జైలు శిక్షతో పాటు రూ.1.50 లక్షలు జరిమానా విధిస్తామని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని మునసబుపేట గాయత్రి కాలేజీ, ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్లేస్‌మెంట్ సెల్ ఇడీగార్డ్ సంయుక్తంగా ఈ నెల 13 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెయిర్‌లో ప్రముఖ కంపెనీలు ఎంఆర్‌ఎఫ్, ఎంఎస్‌ఎన్' జికె, శ్రీసిటీ పాల్గొంటాయని అన్నారు. ఐటిఐ, డిప్లమో, బిఎస్‌సి కెమిస్ట్రీ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9502408100 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి- మందస

పలాస నియోజకవర్గం మందసలో ఉన్న వాసుదేవ పెరుమాళ్ స్వామి వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను బుధవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కూర్మనాథస్వామి, పీఠికట్ల విఠల్‌రావు, సంతోష్‌పండా, దొంకురు తిరుపతి, రాజాను మహేష్, కర్తల తిరుపతి, కిల్లి బాలకృష్ణ, రోథియా చక్రి, జామి ప్రసాద్, వికాస తరంగిణి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష



మాట్లాడుతున్న మధుర మీనాక్షి

బాలల రక్షణపై దృష్టి

ప్రజాశక్తి- కవిటి

బాలల రక్షణ, బాల్య వివాహాల నిషేధం గురించి ప్రతి పంచాయతీ పరిధిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టి సారించాలని మిషన్ వాత్సల్య జిల్లా బాలల రక్షణ సామాజిక కార్యకర్త టి.మధుర మీనాక్షి అన్నారు. కవిటి మహిళా సమైక్య భవనంలో ఎస్‌హెచ్‌జి సభ్యులు, విఒఎలతో బుధవారం సమావేశమయ్యారు. దత్తత, అనధికార దత్తత వల్ల జరిగే నష్టాలు, ప్రభుత్వ అనుమతి లేకుండా బాలబాలికలతో వసతి గృహాలు నిర్వహించే వారిపై తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా బాల్య వివాహాల కట్టడికి ప్రతి అంగన్వాడీ కేంద్రం పరిధిలో కిషోర్ బాలికలు (11 నుంచి 18 ఏళ్లు) సంఘాలుగా ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం గోవిందరావు, మహిళా సమాఖ్య కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కమిటీల పనితీరే కీలకం

ఎపిఎం కూర్మారావు

మందస : సంఘాల పటిష్టతలో సబ్ కమిటీ పనితీరే కీలకమని ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. స్థానిక మండల సమాఖ్యలో సవర కాంతమ్మ ఆధ్వర్యాన మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థల బలోపేతానికి సమర్థవంతమైన పాలన అందించాలన్నారు. ఏడు రకాల సబ్ కమిటీలు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ హుమన్ రిసోర్సును సక్రమంగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. సిబ్బంది నియామకం, వారి పనితీరుపై సమీక్షించారు. గౌరవ వేతనాన్ని ఇచ్చే అధికారం కమ్యూనిటీ సభ్యులకే ఉందన్నారు. అందుకు సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన బాధ్యత పూర్తిగా సంస్థలకే ఉందని వివరించారు. కార్యక్రమంలో మండల సమైక్య అకౌంటెంట్ కళ్యాణి, ఎంఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జానకిరామిరెడ్డికి సన్మానం

ఇచ్ఛాపురం: మండలంలోని మశాకపురానికి చెందిన తెలుగు సాహితీవేత, జానపద సంగీత కళాకారుడు రంగాల జానకిరామిరెడ్డి ఇటీవల విజయవాడ తుమ్మనపల్లి కళాక్షేత్రంలో కాళోజి బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక ఆధ్వర్యాన జాతీయ నంది అవార్డు పొందారు. ఈ మేమేరకు ఇచ్ఛాపురంలో ఎంపిపి బోర పుష్ప, వైసిపి మండల అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ ఆధ్వర్యాన వైసిపి నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కారింగి మోహనరావు, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నూకయ్య, రంగాల కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు నర్తు ప్రసాద్, సారంగి త్రినాథ్‌రెడ్డి, నీలపు సారథి, ప్రియ, బదకల మోహన్‌దాస్, దుక్క ధనలక్ష్మి, ఆసి పురుషోత్తం, బాకీ లక్ష్మీనారాయణ, నగిరెడ్ల చిరంజీవి, దూడ రాజేష్, కొత్తపల్లి భీముడు, బింగి నీలాద్రి, దుపనా వెంకటరావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

రైల్వే సూపరింటెండెంట్‌కు ఉత్తమ అవార్డు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ సూపరింటెండెంట్ పనిచేస్తున్న రమణ చేస్తున్న సేవలకు కుర్దా డివిజన్ డిఆర్‌ఎం భజ్య బుధవారం ఉత్తమ అవార్డును అందజేశారు. ఇటీవల జనరల్ మేనేజర్ పర్యటన సందర్భంగా రమణ సేవలు గుర్తించారు. అవార్డుతో పాటు రూ.5 వేలు నగదు రివార్డుకు సిఫార్సు చేశారు. దీంతో డిఆర్‌ఎం ఈ అవార్డును, నగదును అందజేశారు. ఉత్తమ అవార్డు గ్రహీత రమణకు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న రమణ

కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

ప్రజాశక్తి- పొందూరు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసే అభ్యర్థులకే సంఘం మద్దతు ఉంటుందని ఆ సంఘం అధికార ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్ అన్నారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రాక్టు లెక్చరర్లతోనే మొట్టమొదటిగా ప్రారంభమైన విషయాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ సమాజం గుర్తించాలన్నారు. 25 ఏళ్ల తమ సుదీర్ఘ సర్వీసుల ప్రస్థానంలో ఎటువంటి ఉద్యోగ భద్రతకు నోచుకోలేకపోయామన్నారు. ఐదుగురు ముఖ్యమంత్రులు ఉమ్మడి రాష్ట్రం నుంచి పనిచేశామన్నారు. తమ బతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందన్నారు. తమ తర్వాత సర్వీసులో చేరిన వారిని ఇతర శాఖలలో ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయనీ గుర్తుచేశారు. తమ విషయంలో పాలకులు అన్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చట్టం, యాక్టు ప్రకారం, ఇచ్చిన జిఒ నెంబర్ 114 అనుసరించి సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేశారని అన్నారు. నియామక ఉత్తర్వుల జారీలో ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అయిందన్నారు. ఇప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీలో, కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు.



మాట్లాడుతున్న రాంప్రసాద్

త్వరలో నిర్వహించన్ను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, ఈ విషయంలో ప్రభుత్వంతో ప్రాతినిధ్యం చేసే చిత్తశుద్ధి కలిగిన అభ్యర్థికే తాము అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో అచ్యుతరావు, పొట్నూరు రమేష్, శ్రీనివాసరావు, దాలినాయుడు, శంశకరరావు, గోవిందరావు, లీలాకుమారి, జగన్నాథం, మంజూష, ప్రవీణ, నాగరాజు, కింతలి లావణ్య, శిరీష, సరస్వతి, రత్నకుమారి పాల్గొన్నారు.



పత్రాన్ని అందుకుంటున్న శ్రీరామ్మూర్తి

వ్యవసాయ కళాశాలకు ఐకాన్ గుర్తింపు

ఎచ్చెర్ల: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ వర్సిటీకి అనుబంధంగా మండలంలోని సంతసీతా రాంపురంలో వికాస్ విద్యాసంస్థల సారథ్యంలో ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలను స్థాపించారని ఆ సంస్థల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ కళాశాలకు అత్యున్నత సదుపాయాలు ఏర్పాటు చేయడంతో ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) న్యూఢిల్లీ గుర్తింపునిస్తూ గత నెల 27న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు బుధవారం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సమావేశంలో అసోసియేషట్ డిన్.ఎమోష, ఇన్‌ఛార్జి అసోసియేట్ డిన్ డాక్టర్ శ్రావణి. అకడమిక్ ఇన్‌ఛార్జి డాక్టర్ రాజారుషి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హర్షవర్ధన్, లైబ్రేరియన్ అనిల్ పాల్గొన్నారు.

అందుబాటులో 'స్టెమీ' ఇంజెక్షన్లు

పలాస : గుండెపోటు గురైన రోగికి స్టెమీ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నాయని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.పాపినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపోటుకు గురైన బాధితుడు గంటలోపుగా ఆస్పత్రికి చేరుకుంటే వేల ఖరీదు చేసే స్టెమీ ఇంజిక్షన్ ఆస్పత్రిలో ఉండే జిషియన్లు సిహెచ్.రఘురామ్మూర్తి, ఎ.మేఘన పర్యవేక్షణలో ఉచితంగానే అందిస్తామని అన్నారు. పలాస పరిసర ప్రాంతవాసులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సముదాయాల విధానం మార్పు

టెక్కలి: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పాఠశాల సముదాయాల నిర్వహణా విధానాన్ని మార్పు చేశారు. విద్యాశాఖ ఉన్నతస్థాయి అధికారుల సూచనల మేరకు మూడో శనివారం పాఠశాలల సముదాయం నిర్వహించనున్నారు. గతంలో నిర్వహించిన సబ్జెక్టు సముదాయాలను రద్దు చేశారు. మండలాల్లో ఇప్పటికే ఉన్న సముదాయాల స్థానంలోనే ఈ సారి పాఠశాల సముదాయాలు నిర్వహించనున్నారు. ఈ ప్రదేశానికే ఆయా పరిధిలోని ఉన్నత పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కూడా హాజరుకావాలి. అయితే గతంలో రెండు పూటల నిర్వహించే ఈ పాఠశాల సముదాయాలు శనివారం ఒక్కపూట మాత్రమే నిర్వహించనున్నారు. ఉదయం పూట పాఠశాలల్లో తరగతులు నిర్వహించి రెండో పూట సముదాయాలకు ఉపాధ్యాయులు హాజరుకావాలి. టెక్కలి మండలంలో నర్సింగపల్లి, పోలవరం, తలగాం, ఎట్ నౌపడా ఆర్‌ఎస్, బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సీతాపురం, ఉన్నత పాఠశాలల్లో సముదాయాలు శనివారం నిర్వహించనున్నారు. మారిన ఈ విధానంపై ప్రాథమికంగా అంచనా వేసి పాఠశాలల సముదాయాలు నిర్వహణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవచ్చునని పలువురు ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



శిథిలావస్థకు చేరుకున్న వంతెన

బూర్జ: ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని నారాయణపురం ఎడమ కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన పైనుంచి 30 గ్రామాల ప్రజలు, వాహనాలు అనునిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా నారాయణపురం ఆనకట్ట వద్ద ఇసుక ర్యాంపు ఉండడంతో భారీ ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి, పగలు ఇసుక లోడ్లతో వాహనాలు వెళుండడంతో ఏ సమయంలో వంతెన కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బూర్జ మండలంలోని లాభం, గుత్తావల్లి, సంతకవిటి మండలాల నుంచి సుమారు 30 గ్రామాల ప్రజలకు ఈ వంతెన ప్రధాన ఆధారం. ఈ వంతెనపై నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు శ్రీకాకుళం, ఇటు కొల్లివలస వెళ్లి వస్తూ ఉంటారు. ఇటీవల వంతెన సైడ్ వాల్ కూలిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని వాపోతున్నారు.

ఇంటర్న్‌షిప్‌కు 'ఐతమ్' విద్యార్థులు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులకు చెందిన చివరి ఏడాదికి చెందిన జాహ్నవి ఇప్పిలి, పాయల చరణ్‌లు హైదరబాద్‌లో 'యంత్రా ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్' కంపెనీలో 4 మాసాల పాటు ఇంటర్న్‌షిప్ శిక్షణకు ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణా కాలంలో నెలకు రూ.20 వేలు చొప్పున ఆ కంపెనీ స్టైఫండ్ అందజేస్తుందన్నారు. శిక్షణా కాలం ముగిసిన తరువాత రూ.6 నుంచి 8 లక్షల ప్యాకేజీతో అదే కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తారని వివరించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తులసీరావు చింతాడ కంపెనీ ఫౌండర్ సిఇఒగా ఉంటూ అనతి కాలంలో మంచి గుర్తింపు పొంది కంపెనీని ముందుకు తీసుకెళ్తున్నందున అభినందనలు తెలిపారు. అలాగే చీఫ్ డేటా సైంటిస్ట్‌గా వ్యవహరిస్తున్న సోమేశ్వరరావులకు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస రావు, హెచ్‌డిలు డాక్టర్ వై.రమేష్, డాక్టర్ బాలక రమేష్ నాయుడులు యంత్రా ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడు కృతజ్ఞతలు తెలిపారు.



పత్రాలను అందజేస్తున్న నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక కోర్టుల సముదాయం వద్ద బుధవారం ఆరవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు కే.కిషోర్‌బాబు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న సభ్యులకు బుధవారం ఇంటింటికీ వెళ్లి పుట్టిన పిల్లలు, అంగవైకల్యం గల పిల్లల గురించి నమోదు చేయాలన్నారు. అలాగే బాల్యవివాహాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎ.వెంకట్, అప్పలనాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ముగిసిన ఉత్సవాలు

ప్రజాశక్తి- పోలాకి

పోలాకిలో కనకదుర్గా భవానీ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు భవానీ, పల్లి రాజు భవానిలు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎస్‌ఐ జి.రంజిత్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా వార్షికోత్సవం

టెక్కలి రూరల్ : టెక్కలి అయ్యప్పనగర్‌లో బుధవారం ఎలక్ట్రిసిటీ 1104 ఎంప్లాయిస్ యూనియన్ 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా టెక్కలి విద్యుత్, కార్మిక భవనం వద్ద పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి డివిజన్ అధ్యక్షులు ఎన్.లోకేశ్వర రావు, కె.గిరీశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎ.గోపాల రత్నం, కోశాధికారి మెట్ట హిమగిరి పాల్గొన్నారు.

ఎంఆర్‌పికే మద్యం విక్రయించాలి

సోంపేట : మద్యం బాటిల్స్‌పై ముద్రించిన ధరలకే మద్యం విక్రయించాలని ఎక్సైజ్ సిఐ కె.బేబీ ఒక ప్రకటనలో ఆదేశించారు.. ప్రభుత్వం మద్యం రేట్లను మార్చిన సంగతి తెలిసిందేనన్నారు. ఆ మేరకు ప్రతి మద్యం దుకాణం వద్ద ధరలు పట్టికను ప్రదర్శించాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎమ్మెల్యే ఎన్ఇఆర్

కేంద్రమంత్రిని కలిసిన ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ మంత్రి నితిన్ గడ్కరీను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరితో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అవసరమైన రహదార్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ముందుగా ఎమ్మెల్యేగా గెలిచినందుకు ఎన్ఇఆర్‌కు అభినందించారు. తన వంతు సహకారం అందిస్తానని అన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం గోవిందరావు

ఎ-గ్రేడ్ తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని అన్ని ఎస్‌హెచ్‌జిలు ఎ-గ్రేడ్‌లో ఉండాలని ఎపిఎం గోవిందరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమైక్య భవనంలో బుధవారం విఒఎలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళా లక్షాధికారి కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్టు తెలియజేశారు. అందులో భాగంగా ఎస్‌హెచ్‌జిలో మహిళలకు పూర్తిస్థాయి ఆర్థిక స్వావలంబన కలిపిస్తూ వారికి అండగా ఉంటున్నట్టు చెప్పారు. అదే సమయంలో మండలంలోని రుణ వసూలు శతశాతం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణం కొండపోలమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ప్రతిభా త్రిపాఠి దంపతుల కుమారుడు కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. చేతికి అందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు ఆర్థికంగా, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వారి వైద్య అవసరాల నిమిత్తం రూ.7 వేలు ఆర్థికసాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ధనుష్ రంగ, రాజ్‌కుమార్, నరేంద్ర పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉద్యాన పథకాలపై అవగాహన

సోంపేట : మండలంలోని మామిడిపల్లి, సిరిమామిడి గ్రామాల్లో బుధవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యాన రైతులకు వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొబ్బరి పంటలకు వర్తించే బీమా, బిందు సేద్యం ఇతర పథకాలను గురించి తెలియచేశారు. అలాగే బుసభద్రలో నిర్వహిస్తున్న కూరగాయల క్షేత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాధవీలత, భార్గవి, సుధారాణి పాల్గొన్నారు.

'సూర్యఘర్'తో విద్యుత్ ఆదా

పలాస : సూర్య ఘర్ విద్యుత్ ఆదా అవుతుందని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన డివిజన్ పరిధిలోని కార్యదర్శులకు బుదవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ఆదా చేసేందుకు పిఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయితీలపై సూర్యఘర్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రస్తుతం ప్రతి సచివాలయంలో ఒకటైనా సూర్యఘర్ ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలన్నారు. రెండు కిలోవాటు రూ.60 వేలు, మూడు కిలో వాట్స్ రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఎవరికైనా విద్యుత్


మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

మీటరు పేరు తప్పు ఒప్పులు, పేరు మార్పులు, చిరునామా మార్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. వివరాల కోసం స్థానిక సచివాలయ లైన్‌మేన్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఇఇ యఘ్నేశ్వరరావు, ఎంపిడిఒ కె.వసంతరావు, ఎడిఇ ఐ.కృష్ణమూర్తి, ఎఇ నాగభూషణరావు పాల్గొన్నారు.

ఆదివాసీలపై మారణకాండను ఆపాలి

ప్రజాశక్తి- పలాస

మధ్య భారతంలోని అడవుల్లో మోడీ ప్రభుత్వం నెత్తుటేరులు పారిస్తుందని, బీజాపూర్ ఎదురు కాల్పుల్లో 31 మంది మావోయిస్టులను, ఇద్దరు జవాన్లు మృతి చెందారని అధికారులు చెబుతున్నారని ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ అన్నారు. అందులో ఆదివాసులు ఎందరో, మావోయిస్టులు ఎందరో స్పష్టత లేదని, ఈ మారణకాండను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడులో సమావేశం నిర్వహించి బీజాపూర్‌లోని మారణకాండను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ సర్కార్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన ప్రతిపక్షాలను కూడా అర్బన్ నక్సల్స్‌గా ముద్రలు వేస్తుందన్నారు. ఇప్పటికే ఆదివాసీలను అడవుల నుంచి గెంటి వేయడానికి 1/70



మాట్లాడుతున్న బాలకృష్ణ

చట్టాన్ని, పీసా చట్టాన్ని నీరు గార్చే చర్యలకు పూనుకుందని విమర్శించారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, రైతు కూలీ సంఘం నాయకులు రాపాక మాధవరావు, పివైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు పి.మల్లిబాబు పాల్గొన్నారు.

నేత్ర దానం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని హయాతీ నగరంలో నివాస ముంటున్న పొట్నూరు శ్రీనివాసరావు (61) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు.


శ్రీనివాసరావు (ఫైల్)

అతని నేత్రాలను మగటపల్లి నేత్ర సేకరణ కేంద్రానికి దానం చేశారు. కార్నియాను సేకరించిన వారిలో సుజాత, సుమతి, తదితరులు పాల్గొన్నారు.


వీధి దీపాలు వెలిగిస్తున్న సిబ్బంది

సొంత డబ్బులతో వీధి దీపాలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న టిడిపి వార్డు ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్ స్పందించి సొంత డబ్బులు వెచ్చించి బుధవారం మరమ్మతులు చేపట్టారు. వార్డులో లైట్లు, పైపులు క్యాంపులు లేక అంధకారం నెలకొంది. దీంతో సమస్య గుర్తించిన సంతోష్ హరిజన వీధి, లాలాపేటలో లైట్లు వేయించారు. మున్సిపల్ అధికారులు చిన్న చిన్న పనులు కూడా స్పందించకపోవడం దారుణమని వార్డు వాసులు ఆరోపిస్తున్నారు. మొత్తం మీద సంతోష్ స్పందించిన తీరుపై వార్డు ప్రజలు అభినందిస్తున్నారు.

వంట సామగ్రి వితరణ

పలాస : మండలంలోని బొడ్డపాడు అగ్నికుల క్షత్రియ సంఘంకు కళాకారులు, సంఘ సంస్కర్త, అండమాన్ జగదీశ్వర సంఘం నామ ప్రదాత, టిడిపి నాయకులు గెదెల చిన్నారావు బుధవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ మేరకు మృతుడి భార్య భానుమతి, కుటుంభ సభ్యులు రూ.50 వేలు విలువ చేసే వంట సామగ్రిని వితరణగా అందించారు. కార్యక్రమంలో పొత నపల్లి లక్ష్మణరావు, బొడ్డు దుశ్యంత్, బుడత ధనరాజ్, బొడ్డు మహలక్ష్మి, బొడ్డు మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మ ఉత్సవాలు

నందిగాం : మండలంలోని కనితి ఊరిలో గల కొత్తమ్మ తల్లి గ్రామదేవత 22వ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుల తెలకపల్లి ప్రసాద్ శర్మ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యుగంధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


దర్శించుకుంటున్న తిలక్, తదితరులు

వైసిపి మండల అధ్యక్షునిగా రవికుమార్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ప్రగతి భవన్‌లో బుధవారం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధ్యక్షతన మండల వైసిపి మండల అధ్యక్షునిగా అల్లుకోలకు చెందిన సర్పచర్ ప్రతినిధి దువ్వాడ రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రవికుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన మాజీ మంత్రికి, వైసిపి నాయకులకు అభినందలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి), జిల్లా కార్యదర్శి బత్తిన హేమేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి


అభినందిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

దుర్యోధనరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కొర్ల సంతోష్, ఉద్దానం పంచాయతీ అధ్యక్షులు సైన దేశయ్య, బొడ్డు సుధాకర్, రాపాక చిన్నారావు పాల్గొన్నారు.


అభినందిస్తున్న కరస్పాండెంట్ రాజశేఖరం

నిత్యశ్రీ కస్యప్‌కు అభినందనలు

పలాస : కాశీబుగ్గ లిటిలింజెల్స్ హైస్కూల్‌లో చదువుతున్న ఎస్.నిత్యశ్రీ కస్యప్‌కు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం లభించింది. ఈ నెల 2న శ్రీకాకుళం నిర్వహించిన పోటీల్లో జిల్లాలో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. విజయవాడలో ఈ నెల 9న రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించగా, కాశీబుగ్గ లిటిలింజెల్స్ హైస్కూల్లో 5వ తరగతి చదువుతున్న ఎస్.నిత్యశ్రీకస్యప్ తతీయ స్థానం సాధించడంతో బుధవారం కరస్పాండెంట్ జి.రాజశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, శంకరరావు, రష్మిత, శ్రావణి, పద్మ, సంతోష్, రవి పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎటువంటి భయం లేకుండా నిబద్ధతతో పరీక్షలు రాయాలని ఎంఇఒ అప్పారావు విద్యార్థులకు సూచించారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారిలో ఉన్న పరీక్ష భయాన్ని పోగొట్టి మంచి మార్కులు పొందేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులకు


పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట కార్మికులకు మెనూ అనుసరించాలని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈయనతో పాటు పాఠశాల సిబ్బంది, సిఆర్‌ఎంటి ఆర్.దేవరాజు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి రోషిణి

ఎక్కువ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి కోరారు. కోర్టు పరిధిలోని న్యాయవాదులతో, పోలీసులతో సమావేశ మందిరంలో బుధవారం వేర్వేరుగా మాట్లాడారు. ఇరు శాఖాధికారుల సమన్వయంతో కేసులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఎక్కువగా కేసులు పరిష్కారానికి ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారిని ఒప్పించి రాజీకి యత్నించాలని కోరారు. సమావేశాల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దివ్వల వివేకానంద, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, పోలీసు అధికారులు, న్యాయవాదులు సాయిరాజ్, ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు, పైల చంద్రుడు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5,89,324

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. సహాయ కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షణలుగా జి.వి.బి.ఎస్. రవికుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు ఈ లెక్కింపు నిర్వహించారు. 38 రోజులకు రూ.5,89,324 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు తోలాపు సంతోష్‌కుమార్, స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ సేవా సమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

16న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పలాస

స్థానిక రామకృష్ణా సేవా సంఘం 65వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 16న హైస్కూల్ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. సేవా సంఘం కార్యాలయంలో ఈ రోజు ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీలో స్వర్ణోత్సవ భారత రాజ్యాంగ సాఫల్య, వైఫల్యాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. యువతను నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనలో సమాజం, ప్రభుత్వాల పాత్ర అనే అంశంపై వకృత్వ పాటీలు ఆంగ్ల, తెలుగు భాషల్లో ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రథమ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9966360178, 9491569453 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తిరుమలరావు

పలాస విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

పలాస విద్యావాహిని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొవ్వూరు ప్రవీణ్‌కుమార్ జాతీయ స్థాయిలో నిర్వహించిన టెన్నికాయిట్ పాటీలో తన ప్రతిభను కనభరిచారు. ఇటీవల తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నిర్వహించి జాతీయ స్థాయి టెన్నికాయిట్ ఆటల పోటీలో వ్యక్తిగత విభాగంలో నాలుగో స్థానంలో నిలిచి ప్రతిభకనభరిచారు. విద్యార్థికి ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, ఆయుధం గిరి, పైల తిరుపతిరావు అధ్యాపకులు అభినందించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

17న ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురంలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి పంచాయతన ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే మహా శివరాత్రి పర్వదినం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ తీర్మానం చేసింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, ఎంపిటిసి మాజీ సభ్యులు దన్నాన అజీర్, వడ్డిపల్లి శ్రీనివాసరావు, గంట్యాడ అప్పలనాయుడు, ఇజ్జాడ సన్యాసినాయుడు పాల్గొన్నారు.